# "చూడండీ" కె. రామలక్ష్మి




చలికాలం - మధ్యాహ్నం పూట మామూలుగానే - బస్సు దిగి నడుస్తున్నాను - ఇంటికేసి. 'ఇంటికి' అనేసరికి తెలియకుండానే వస్తుంది కాబోలు కాళ్లలోకి చురుకు! కొత్తగా రూపందిద్దుకున్న కాలనీయేమో ఇళ్లన్నీ ఇంకా కడిగిన ముత్యాల్లాగా వున్నాయి.

ఫ్లాట్లే అయినా చాదస్తం - గృహ ప్రవేశం చేసిన వారింకా ఎండిపోయిన మామిడాకు తోరణాలు తీసేయలేదు. ఆకులు రంగు మారిపోయి అసహ్యంగా తయారయ్యాయి! చిన్న తోట. చక్కని పూలు. అక్కడ అక్కడ ఆగిన కార్లు, స్కూటర్లు — ఆ ప్రాంతం అంతా చక్కగా, హాయిగా అనిపిస్తుంది - చూసేవాళ్లకి.. కాని అక్కడ నివసించే వాళ్లకి తెలియని ఇబ్బందులు చాలానే వుంటు న్నాయి. ముక్కూ ముఖం తెలియని మనుషు లంతా తచ్చాడుతూ ఇబ్బంది పెడతారు. అయితే ఒక్కటి మటుకు చెప్పుకోవాలి... పెళ్లి చేసుకోని నన్ను వాళ్లు వింత మృగంలా చూడరు... కొందరు గృహిణులకి మనస్సులో కాస్త ఎడ్మిరేషన్, కాస్త జెలసీ... తమకు లేనివేవో నాకు వున్నాయని - చాలా హాయిగా వున్నానని ... నిజమే. చక్కని ఉద్యోగం, స్వంతంగా ఫ్లాట్ కొనుక్కున్నాను. చుట్టాలు వచ్చి పోయినా - పట్టించుకోను... నా వెనకాల నన్ను గురించి ఏం చెప్పుకున్నా పట్టించుకోను. ఎందుకు పట్టించుకోడం? దండగ. ముఖం మీద అంటే బదులేనా చెప్పొచ్చు. చాటుమాటుగా రాళ్లు విసిరే పిరికి వాళ్లంటే నాకు చాలా అసహ్యం... భుజాన వున్న హాండ్ బాగ్ బరువు అనిపించి ఆ భుజం నుంచి ఈ భుజానికి మార్చుకున్నాను.

## మతస్వాతంత్ర్యం

'మతస్వాతంత్ర్యం' .అన్నది పైకి కనిపించినంత ఉదారమైనది కాదు. మతాలన్నీ ఒకటేనన్న వాళ్ళు మత మూఢులు. మతాలు ఏకం కావలసిన జనాన్ని విడగొట్టటమేగాక, పూర్తిగా నిరుపయోగమైన విశ్వాసాలను అమలులో వుంచుతాయి. •సంఘజీవి అయి పదిమందిలో చావు పెళ్ళితో సమానం అన్నట్లు జీవించే సామాన్య ప్రజలలో ఒక మత మూఢుడు వంద మందిని మత మౌఢ్యంలో వుంచగలడు. ఈ సత్యాన్ని గుర్తించే, అలుగ్గుడ్డ స్థాయిలో వున్న మన దేశాలు ప్రజా శత్రువులైన ప్రజా పాలకులు ప్రజలకు పొద్దున్నే కాఫీతో పాటు భక్తిరంజనులూ, భజనలూ, మతోపన్యాసాలూ మొదలైనవి రేడియోలో ప్రారంభించి, రోజల్లా తోముతారు. ఈ తోముడు ప్రజలను మరింత మంచి పౌరులను చేస్తాయనా? వారి ఆర్థిక దశను ఒక శాతం మెరుగుపరుస్తాయనా? ఏదీ కాదు.

—కొడవటిగంటి

సేకరణ — ఈదుపల్లి

ఇంటి మీద ధ్యాసతోనే చుట్టూ చూస్తూ నడుస్తున్నాను — దారి అంతా కొట్టిన పిండే నాకు! నా పై మేడలో అమ్మాయికి పురిటి రోజులు. ఇంకా పై మేడ మీది అమ్మాయికి అత్తగారి బాధ... అన్నీ తెలిసినా నాతో వాళ్ళేం చెప్పరు. 'పెళ్లీపెడాకులూ లేనిది లీల. ఆవిడగారికివేం అర్థం కావు. టాపుటేపుగా అలంకరించుకుని ఉద్యోగానికి వెళ్లేది!' అనుకుంటారట నా వెనక. నా పనిపిల్ల చెప్పింది. 'అమ్మా, ఎన్నెన్ని ఆరాలు లాగుతారోనండి — మీ గురించి!' నవ్వుకుంటూ చెప్తూనే వుంటుంది నాగమ్మ. దానికీ నలభై ఐదు దాటింది. మొగుడు ముండల వెంట తిరుగుతున్నాడని తెలిసి 'నీ రోగాలు నాకు వద్దు. నువ్వూ నాకు వద్దంటూ' వదిలేసింది. అదే ఈ విషయం చెప్పింది. 'కొడుక్కి రోషం పొడుచుకొచ్చింది. తల తీసినట్టుగా వుందట. పొమ్మన్నాడు. నాకేం భయం — నాలుగిళ్లు పనిచేసుకుంటే వాడి లాంటి పదిమందికి నేనే తిండి పెట్టగల'నంది చాలా గర్వంగా. దాన్ని చూస్తే నా కిష్టం. అంత స్వాతిశయం, ఆత్మగౌరవం చదువుకుని ఉద్యోగం చేస్తున్న వాళ్లలో కూడా నేను చూడలేదు!

ఇంకో రెండు సందులు తిరిగితే — మా బ్లాక్ వచ్చేస్తుంది. హఠాత్తుగా — 'క్షమించండీ' అంటూ పిలుపు వినిపించి ఆగి మాట వచ్చిన వైపుకి తిరిగి చూశా. అప్పటిదాకా అక్కడ రోడ్డు వారగా నిలబడిన కారు నా కంటపడేలేదు. 'క్షమించండి' అంటూ తలుపు తెరచి కిందికి దిగి నిలబడ్డాడా వ్యక్తి. కాస్త పొడగరే. సిల్కు షర్టు కాబోలు చల్లగాలికి కదలాడుతోంది. అలా దిగిన వ్యక్తి అడుగు ముందుకి వేయడం కనబడలేదు. కార్లో ఏదైనా అడ్రసు కాగితం మరచిపోయాడా? అనుకున్నాను. ఈ కాంక్రీటు అడవుల్లో - లెక్కల ఫార్ములాల్లాగా వుంటున్న ఇంటి నెంబర్లలో ఏది కావాలో? కొత్త కాబోలు ఈ ప్రాంతానికి అనుకుంటున్నా. అనుకుంటూనే ఒక్క అడుగు ముందుకి వేయబోయాను... లైట్సు వేస్తు అవు తోందని — ఇంకా బాగా వెల్తురుంది.

'క్షమించండి' అన్నాడు మళ్ళీ.

చటుక్కున తిరిగి చూశాను.

అంతే. క్షణం పాటు ఏం జరిగిందో నాకే అర్థం కాలేదు. 'చూడ్డానికెంతో సభ్యమైన మనిషిలా కన్పించినవాడా ఈ మనిషి. ఛీ...' అంటూ తల తిప్పుకుని నడక వేగం హెచ్చించి... ఇల్లు చేరుకున్నాను. నా వెన్నులో ఏదో ఒణుకు. నాకే తెలియని ఏదో అసహ్యం - నన్ను పూర్తిగా ఆవరించింది. మామూలు మనిషిలా కన్పించాడు. మనకి రోజూ ఎదురయ్యే ఏ ఉద్యోగైనా ఇలాగే వుంటాడు. నా పక్క ఫ్లాట్‌లో మనిషైనా ఆశ్చర్యం అక్కరలేనంత మామూలుగా అనిపించినవాడా ఇంత చౌకబారు మనిషి!" ఈ ఊహ నా మనసులోంచి పోనంటూంది. ఇలాంటి వాళ్లెలా తెలుస్తారు? ఆశ్చర్యం నన్ను ముంచెత్తి చంపుతోంది. ఏం చెయ్యాలి! "క్షమించండి" అంటూ పిలిచాడు. తిరిగి చూడకుండా ఎలా వెళ్లిపోడం? ఏ అడ్రసేనా కావాలేమో? ఆ పిలవడం కూడా ఎంతో మామూలుగా వుంది — ఏదో పారేసుకుంటే 'చూడండీ' అంటూ హెచ్చరిస్తున్నట్టు "ఇదిగో పారేసుకున్నారు. చూసుకోలేదు" అన్నట్టు. అమర్యాదగా లేదు. అలా అని నిర్లక్ష్యం చేసే గొంతూ కాదు... కాస్త గంభీరంగా కూడా అనిపించింది.

ఒణుకుతున్న మనసుతో గబగబ ఇల్లు చేరానో లేదో నాగమ్మ ఎదురుచూస్తూ కనబడింది. దాన్ని చూసి నాకు కాస్త ధైర్యం వచ్చింది. చేతిలో బాగ్ అందుకుంటూ "అలా వున్నారేం అమ్మా! ఒంట్లో బాగులేదా?" అంటూనే మెట్లెక్కేసి తాళం తీసింది. లోపలికి జొరబడి — సోఫాలో కూలబడ్డాను. కళ్లు మూసుకుని తల వెనక్కి సోఫాలో వెనక్కి వాల్చాను. అయినా నా చెవుల్లో "చూడండీ' అని విన్పిస్తూనే వుంది.

వేడి వేడి కాఫీ అందిస్తూ 'ఏమైందమ్మా! చెప్పండి — తమరలా వుంటే నాకేం బాగాలేదు' అంటూ సోఫా పక్కనే కూలబడింది.

కాఫీ తాగాను. కప్పు అందుకుని పక్కన పెట్టింది.

"దార్లో వస్తూంటే ... ఒక చోట... ఛ" ఆగిపోయాను. ఏమని చెప్పను? చెప్తే ఏమనుకుంటుంది?...

"చెప్పండమ్మా, ఎవరేనా అల్లరి చేశారా?" ఆత్రంగా అడిగింది.

"లేదు... కాని... ఒకడు..." ఆగిపోయాను.

"వెధవ చచ్చినోళ్లు. ఆడది పచ్చగా వుంటే చూడలేరు..."

"అది కాదు నాగమ్మా — నేను నడిచి వస్తూన్నాను. పక్కగా కారాగి వున్నది కూడా నేను గమనించలేదు. చూడండీ అని కేకేశాడు."

అప్పటికే నాగమ్మ చెయ్యి బుగ్గలు నొక్కుకుందుకు కాబోలు ముఖాన్ని చేరింది. "ఏమేనా అన్నాడా?"

"లేదు. నేనేమైనా కింద పారేసుకున్నానేమో అనుకున్నా. లేదు. అడుగు ముందుకేయబోతుంటే మళ్ళీ పిలిచాడు. ఏదో అడ్రసు కోసం అని చటుక్కున తిరిగి చూశాను..."

'ఆ '

"అవును. చూడకుండా ఎలా? చూశాను."

"ఏం అడిగాడు?" ప్రశ్నించింది నాగమ్మ.

"ఏమీ అడగలేదు. చూపెట్టాడు." నా మాట నాకే వింతగా ధ్వనించింది.

'ఆ దొంగ చచ్చినాడా!' నమ్మలేనట్టు అంది నాగమ్మ.

'మీ రెందుకు చూశారమ్మా' అంటుందేమోనని భయం వేసిన నాకు — అదంత సులభంగా గ్రహించడంతో దడ తగ్గింది.

క్షణంలో సగం సేపు కూడా తిరిగి చూడలేదు ... నేనేం పాత కాలపు మనిషిని కాదు. ఫోనులో అసభ్య సంభాషణ చేసినా ముఖం వాచేలా చీవాట్లు పెట్టి రిసీవరు నేలకేసి బాదకలదాన్నే, దారేపోయే దానయ్యల కామెంట్స్ లెక్కచేయని దాన్నే... దరిద్రపు బూతు సినిమా పాటలలో ఆడవాళ్లని ఏడిపించే అనాగరికుల ఉనికినేమి — గుర్తించను — నలుగురు మగాళ్లు కూర్చుని ఒక్క ఆడది కూర్చున్నా... ఆర్భాటంగా

అంగాంగ వర్ణనలు చేస్తూ సొల్లు కార్చుకునే వారిని చాలా మందిని చూశాను. వారికి కావలసింది — ఆడది రియాక్ట్ అవ్వాలి. అయితే అందలం ఎక్కినంత సంబరం — వాళ్ల శ్రమ వృథా కాలేదని ... నేనా తృప్తి ఎందుకివ్వాలి వాళ్లకి! అందుకే - ఇగ్నోర్ చేసి పారేస్తాను... ఇప్పుడు మటుకు ఈ వెధవకి కావలసింది - అదే - స్పందించడం. పక్కని కాలనీలో సాయంత్రం పూట వాడెవడు? ఇటువంటి రియాక్షన్ ఎదురు చూడ్డానికి?

'అమ్మా నాలుగు తిట్టకపోయారా? గట్టిగా కేకవేసి నలుగుర్నీ పోగుచేసి ఇంత గడ్డి పెట్టించలేక పోయారా? ఎందుకూరుకున్నారు?'' కోపంగా అంది.

ఏం చెప్పాలి దానికి? హాయిగా నడిచి వస్తూన్న నాకిలాంటి అనుభవం ఎదురౌతుందని తెలిస్తే చూస్తానా? నిలబడతానా అసలు? కారులోకి వంగి చిరునామా కోసం చూస్తున్నాడనుకుంటానా?... ఇదొక వింత అనుభవం - ఒక మగాడు నాగరికుడిలా కన్పించినవాడు క్షణంలో సిల్కు చొక్కాని తొలగించి పాంటు జిప్పు లాగి 'చూడండి' అంటాడని ఎలా అనుకుంటాను...

నాలో అప్పటి ఒంటరితనం — పరుగున ఇల్లు చేరేలా చేసింది. వాడికి అదే కావాలి కాబోలు — నేను బిత్తరపోవడం వాడికి గెలుపా?... అందరూ ఎక్కడెక్కడో ఎవరుండవలసిన చోటు వారున్నారు. ఆ క్షణంలో ఆ రోడ్డు మీద నేను ఒంటరిని. అతగాడూ ఒంటరి... కాని నేనే... నేనే ఆ క్షణంలో వుండకూడని చోట ఉన్నానా అనిపించింది...

ఎన్నెన్ని రకాల వికృతులలో ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి మొదలు చూశాను. బాత్‌రూంలో చెత్త రాసే వాళ్లు ఎందరు లేరు? కాని ఇలా పట్టపగలు చక్కటి వాతావరణంలో ... మొండి ధైర్యంతో ఇలా! ఛ... సరదాగా గడిపిన రోజు చివర్న ఎవరో అవమానించినట్లనిపించింది. నాకు భయం వేసిందని కాదు... ఒంటరినై వున్నానని. ఆడదాని విషయంలో భయానికీ ఒంటరితనానికీ ఇలాంటి సందర్భాలలో తేడా కన్పించదేమో! కారు తలుపు సగం తెరిచి వుంచి, కారుకు జారబడి ఇలా చేస్తాడని ఎవరనుకుంటారు? వెనక్కి తిరిగి చూసిన క్షణం — ఛ అనుకుని తిరిగిపోయానే. అయినా ఆ దృశ్యం నన్నెందుకింత అవమాన పరుస్తూంది? అతగాడు ఏమనుకున్నాడు? నవ్వు కున్నాడా లోలోన?

'ఆ పెల్లికానిదిలా వుంది. ముఫ్ఫయి పైబడ్డట్టుంది... అటూ ఇటూ కాకుండా చాలా సౌకర్యమైన చోట తారసపడింది...' అనుకున్నాడా?




ఏదో విపరీతపు కోరిక అతన్ని నెట్టిందా ఇలా చేయమని? ఏమనుకుని వుంటాడు? ''ఇలా చూపెట్టాక ఏం చేస్తుంది?'' అని ఊహించుకుని వుంటాడా? ... వచ్చి కోరిక తరువాతకొచ్చి ఇలాంటి దౌర్భాగ్యపు చేష్ట ద్వారా తీరిందా వాడికి? అరుస్తాననుకున్నాడా? పరుగెడతానను కున్నాడా? సిగ్గుపడి తల దించుకుంటానను కున్నాడా?...

తల తిప్పేసుకోడం మినహా ఏం చెయ్యలేని పరిస్థితి... అతని చేష్టకి బదులు కూడా అక్కర లేనంత త్వరగా తల తిప్పుకున్నా — అతడు 'చూడండి' అని పిలిచిన క్షణంలోనే — గెలిచాడు! అతందేం పోయింది? కారు స్టార్ట్ చేసుకు వెళ్లి పోయివుంటాడు...'' నిట్టూరుస్తూ మళ్లా జేరబడిపోయాను.

'అలాంటి వెధవలని పోలీసులకి పట్టివ్వాలమ్మా. ఈ రోజు మీరైంది. రేపింకోరవుతారు. ఇక్కడ ఆడాళ్లు తలెత్తుకు తిరగాలా? ఫోను చెయ్యండి'' అంది నాగమ్మ.

'ఏమని చెప్పను?' నాలో నేనే ప్రశ్నించు కున్నాను.

'నిజమే. ఏం చెప్పను?... ఎలాంటి ప్రశ్నలు వేస్తారో... నిజానికి బయటపడ్డది నేను!... ఇలాంటి అనుభవం జరిగిన ఎందరో చెప్పగా విన్నాను... ఎక్కడ ఎలా ఎప్పుడు జరిగిందో స్పష్టంగా చెప్పగలరు... ఎలా అంటారా?... జరిగిన పరాభవం — మరో వ్యక్తి గతం కనుక. ఎలా మరిచిపోతారు? మరిచిపోలేరు. ఈ చిన్న విషయమే ఆడవారికీ మగవారికీ మధ్య విలేది... గడ్డివాములో సూది దొరకవచ్చు. అది గుచ్చుకున్న నొప్పి, మచ్చా — నిలిచిపోయేది — కలకాలం. వాడి సంతోషం — నేను తిరిగి చూడ్డంలోనే వుంది. అంతే. అతగాడి పని అయింది. కాని నాకు? నాకు జరిగిన పరాభవం — ఏ మగవాడి కైనా జరగడం అసంభవం కదా?'

''వద్దులేవే... మ్యానెన్నూ!'' అన్నాను నిట్టూరుస్తూ. ఆ మాట వెనక నా నిస్సహాయత గుర్తించిందో లేదో నాగమ్మ.

''వాళ్ళకి కావలసినది — మనం చూడ్డం... 'చూడండి' అన్న పిలుపు కాదని ఎలా సాగిపోతుంది ఏ ఆడదైనా? ఎంత అందమైన ప్రాంతమైనా — అసహ్యమైన పిలుపు వినబడకా పోదు. వినకా తప్పదు... కాని ఈ వినడం, చూడడం — ఒక చౌకబారు మగాడి కోరిక తీర్చడం కోసం అయినప్పుడే... అవమానింపబడ్డట్టు — మనసు కొట్టుకుంటుంది. ఈ విషయం నేనెలా మరిచిపోగలను? అది నాలో శాశ్వతంగా వుండక తప్పదు' అనుకున్నా.

''మీరేం బాధపడకండి. వెధవ పురుగులు పట్టి ఛస్తాడు. మదమెక్కి ఛస్తున్న వెధవలు!'' కసిగా తిట్టింది నాగమ్మ.

దాని ధర్మ కోపానికి నాకు నవ్వు రాలేదు. కాని నేనూ అలా తిట్టగల్గితే — ఇంత అవమానంతో కృంగిపోయి వుండనేమో' అనిపించింది.

''పోనీవే నాగమ్మా. మన కాలనీకి బందోబస్తు కావాలని — కాలనీ అసోసియేషన్ మీటింగ్‌లో అడుగుతాను'' అన్నా.

''అడగండడగండి. మ్యాక్ల కెళ్ళే పిల్లలు, కాలేజీ అమ్మాయిలు బోల్డు మంది తిరుగుతూంటారు. ఏ వచ్చినాడో విన్నడిగినట్టే 'చూడూ' అంటే ఎంత కష్టం - లేమ్మా! కాస్త నీళ్ళు పోసుకు రా. తిండి తిని పండుకుందువు గాని — వచ్చినాణ్ణి మరిచిపో ... మా పేట్లో అయితే చీపురు దెబ్బలు తిని మరీ పరుగులంకించుకునే వాడు'' కసిగా అంది నాగమ్మ.

'ఏమో! చదువూ సంస్కారం, సిరికితనం పెంచుతుందా? అవమానాన్ని గుండెల్లో దాచు కునేలా చేస్తుందా?' నాకే అర్థం కాలేదు. కుర్చీ లోంచి లేచి తువ్వాలు అందుకున్నా. చుట్టూ అప్పుడే చీకటి తెర పడుతోంది. కిటికీల్లోంచి చీకటి ఇంట్లోకి త్వరత్వరగా వచ్చి వాలుతోంది.